సాక్షి
ఒడిశా

శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



ఆకట్టుకున్న కళా ప్రదర్శన

పర్లాకిమిడిలో జరిగిన కళా ప్రదర్శన ఆకట్టుకుంది. కళాకారులు అబ్బురపరిచారు. - 8లో



ఉత్సాహంగా సరస్వతి శిశు మందిర్ వార్షికోత్సవం

మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాల 26వ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. - 8లో



అడవుల్లో అగ్ని సెగలు - 8లో

జయపురం అటవీ రేంజ్‌లో గత ఫిబ్రవరి 12 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు 23 చోట్ల అడవులు అగ్ని ప్రమాదాల్లో చిక్కుకుని తగలబడినట్లు తెలుస్తోంది.

న్యూస్‌రీల్

ఆహార కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు



ఆహార కేంద్రంలో భోజనం చేస్తున్న అధికారులు

రాయగడ: ఆహార కేంద్రాల పనితీరుపై మున్సిపాలిటీ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల ఎదురుగా గల ఆహార కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, మున్సిపాలిటీ కార్య నిర్వాహక అధికారి కులదీప్ కుమార్, 17 వార్డు కౌన్సిలర్ మజ్జి శ్రీనివాసరావు ,మున్సిపాలిటీ ఇంజినీర్లు, సిబ్బంది ఆహార కేంద్రానికి వెళ్లి నాణ్యత పరిశీలించారు. అందరితో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే రూ.18కు భోజనం అందించడం కష్టంగా ఉందని, కాస్త పెంచగలిగితే బాగుంటుందని స్వయం సహాయక బృందానికి చెందిన మహిళలు అన్నారు.

ఉపాధ్యాయుడు రక్తదానం



రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయుడు కాలూచరణ బెహర

జయపురం: ఉపాధ్యాయులు విద్యాదానమే కాదు రక్తదానం కూడా చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి ఆర్.భాలుగుడ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు కాలూచరణ బెహరను ఉదహరించవచ్చు. ఆ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న పాయల్ ముండ గుడియ రక్తహీనత కారణంగా అనారోగ్యానికి గురైంది. విషమ పరిస్థితిలో బాలికను బుధవారం జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్చారు. ఆమెను పరీక్షించిన డాక్టర్లు హిమోగ్లోబిన్ తక్కువ ఉందని వెంటనే రక్తం అవసరమని కుటుంబ సభ్యులకు సూచించారు. ఈ విషయం తెలిసిన ఉపాధ్యాయుడు వెంటనే ఆస్పత్రికి వచ్చి బాలికకు అవసరమైన రక్తదానం చేసి ప్రాణాలు కాపాడి మానవత్వాన్ని చాటారు. 2019లో కూడా విద్యార్థిని పాయల్ రక్తహీనతతో మృత్యువుతో పోరాడిన సమయంలో కూడా ఉపాధ్యాయుడు బెహర వచ్చి రక్త దానం చేశారని బాలిక బంధువులు వెల్లడించారు. బెహర సమాజానికి చేస్తున్న సేవను ప్రజలు అభినందిస్తున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఒంటిపూట పనివేళలు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో పర్లాకిమిడి, కాశీనగర్, గుసాని, గుమ్మా, ఆర్.ఉదయగిరి, నువాగడ, రాయఘడ, మోహన బ్లాక్‌లలో గురువారం నుంచి ఒంటిపూట పనివేళలు అమలు చేయనున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకూ పనివేళలను మార్చారు. అధిక ఎండల కారణంగా ప్రభుత్వ కార్యాలయాలు జూన్ 15 వరకూ ఉదయం పూట కార్యాలయాల్లో సిబ్బంది పనిచేస్తారు. రాష్ట్రంలో టిట్లాఘడ్, రాయఘడ, నవరంగ్ పూర్, భద్రక్, సోన్ పూర్ జిల్లాలో ఈ ఉదయం పనివేళలు పని చేస్తాయి. మరికొన్ని జిల్లాలకు ఈ జీఓ వర్తించదు.

ఎలుగుబంటి దాడిలో వృద్ధుడికి గాయాలు



చికిత్స పొందుతున్న ధము నాయక్

మల్కన్‌గిరి: ఎలుగుబంటి దాడిలో వృద్ధుడు గాయపడ్డాడు. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి క్యాంగ్ పంచాయతీ సారంగపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకోగా.. ధము నాయక్ (60) తీవ్రంగా గాయపడ్డారు. సారంగపల్లి గ్రామ సమీపంలోని అడవికి కట్టెలు తేవడానికి ధము నాయక్ గురువారం ఉదయం వెళ్లాడు. కట్టెలు కొడతున్న సమయంలో అతనిపై ఎలుగుబంటి దాడి చేసింది. దీంతో అతను భయంతో కేకలు వేయడంతో సమీపంలో ఉన్నవారు అక్కడకు చేరుకొని ఎలుగుబంటిని తరిమేశారు. గాయపడిన అతన్ని అంబులెన్స్‌లో మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విషయం తెలుసుకున్న మత్తిలి పోలీసులు ఫారెస్టర్ వాసుదేవ్ నాయక్ సమాచారం ఇచ్చారు. దీంతో ఆరోగ్య కేంద్రానికి వచ్చి బాధితుడ్ని పరామర్శించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వన్యప్రాణుల దాడిలో గాయపడిన వారికి అందజేసే నష్టపరిహారాన్ని ధము నాయక్‌కు అందజేస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.



మహావీర జైన్ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

ఘనంగా మహావీర్ జయంతి

జయపురం: జైన సంప్రదాయ ప్రజల ఉత్సవాలలో అతి ముఖ్యమైన.. మతపరమైన ఉత్సవం మహావీర జయంతి. గురువారం పట్టణంలో జైన సంప్రదాయ ప్రజలు అందంగా ఏర్పాటు చేసిన రథంపై మహావీర్ జైన్ నిలువెత్తు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పురవీధులలో ఊరేగించారు. ఊరేగింపులో వందలాదిమంది పురుషులు, మహిళలు పాల్గొన్నారు. సాయంత్రం జైన్ మందిరంలో మత ప్రచారకులు జైన మహావీరులు ఉపదేశాలను, మత సంప్రదాయాలను బోధించారు.

వైభవంగా దొండోనచో ఆటలు

పర్లాకిమిడి: చైత్రమాసం సందర్భంగా పట్టణంలో మాశ్యామకాళీ మందిరం ఆధ్వర్యంలో ఉదయం పూట పురవీధుల్లో అమ్మవారు, దొండోనచో దీక్షాధారులు తిరువీధి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పట్టణంలో దేవిమఠం వీధిలో గురువారం ధూళి దొండో దొండాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 14వ తేదీ వరకూ భక్తుల కోరిక మేరకు వివిధ పురవీధుల్లో దండోనచో దీక్షలు చేస్తారు.



రాజావారి ప్యాలస్ గుండా తిరువీధి యాత్రలో దండోకాళీ



దేవీమఠం వీధిలో దొండాలు ఆడుతున్న కాళీ ప్రసన్నులు



మండుటెండలో ఇసుక తిన్నెలపై ధూళిదొండాటలు

ఘనంగా ఒడియా పక్షోత్సవాలు



వేదికపై అతిథులు



వాయిద్యాలతో సందడి చేస్తున్న గిరిజనులు



సభలో ప్రసంగిస్తున్న సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరిలో ఒడియా పక్షోత్సవాల్లో భాగంగా పదో రోజు గురువారం ఒడియా కళల దినంగా నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఒడిశా సంప్రదాయాల గురించి అందరికీ తెలియాలని అన్నారు. ఈ సందర్భంగా గిరిజనులు తమ కళలను ప్రదర్శించారు.



థింసా నృత్యం చేస్తున్న మహిళలు



ముత్యాలమ్మ జాతర ప్రారంభం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ముత్యాలమ్మ జాతర గురువారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా వంశధార నది నుంచి శుద్ధ జలాలను మహిళలు పెద్ద సంఖ్యలో తీసుకువచ్చారు. అనంతరం ఉత్సవ వేదిక వద్ద ఉంచడంతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ముందుగా అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించిన అనంతరం పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఐదు రోజుల పాటుగా జరిగే ఈ జాతరకు అన్ని ఏర్పాట్లు చేశారు.



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

అమ్మవారికి విశేష పూజలు



విశేష పూజల్లో కమిటీ సభ్యులు



ఘటాలను మోస్తున్న చిన్నారులు

- కొనసాగుతున్న చైత్రోత్సవాలు

రాయగడ: మజ్జిగౌరి అమ్మవారి చైత్రోత్సవాల్లో భాగంగా గురువారం విశేష పూజలను నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు రాయిసింగి బిడిక, సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, పెద్దిన వాసుదేవరావు, వడ్డాది శ్రీనివాస్‌రావు దంపతులు అమ్మవారి సన్నిధిలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన ఆదివాసీ వాయిద్యాల నడుమ జరిగిన పూజల్లో ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ బెరుకో అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించారు. అనంతరం గర్భగుడి నుంచి పూజా వేదిక వరకు వెళ్లిన కమిటీ సభ్యులు అక్కడ సూర్య పూజ, శాలపూజ, దేవి షాపోపచార పూజ, మహాస్నానం, మహాపూజ, హారతి, పుష్పాంజలి పూజల్లో పాల్గొన్నారు. గంజాం జిల్లా కవిసూర్య నగర్ నుంచి వచ్చిన వేదపండితులు ఈ సందర్భంగా గరుడ బొమ్మను చిత్రీకరించారు. అనంతరం ఆ స్థానంలో గరుడ సేవ పూజలు చేశారు.

నగర పరిక్రమణలో అమ్మవారు

దుష్టశక్తుల బారి నుంచి ప్రజలను కాపాడేందుకు నడుం బిగించిన అమ్మవారు ఈ చైత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారి ప్రతిరూపాలుగా కొలిచే ఘటాలు నగర పరిక్రమణలో పాల్గొన్నాయి. అమ్మవారి వెంట ఆమె అక్కచెల్లెళ్లు గ్రామదేవి, భైరవి ఘటాలు కూడా ఉన్నాయి. ఈ ఘటాలను చిన్నారులు మాత్రమే మోస్తారు. వారికి ముత్తయిదువుల్లా ముస్తాబు చేసిన అనంతరం అమ్మవారి ఘటాలను మోయడం ఆనవాయితీ. ఇదిలాఉండగా అమ్మవారు రాత్రి సమయంలో చిన్నారి రూపంలో సంచరిస్తోందని ప్రతీతి. దానికి అనుగుణంగా ఈ ఉత్సవాల్లో అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలను ఆ చిన్నారుల చేత మోయించారు.



బస్సును ప్రారంభిస్తున్న అధికారులు

జబాపోదర్‌కు బస్సు ప్రారంభం

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్రా సమితి కెరిమిట పంచాయతీ నుండి ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దులోని జబాపోదర్ పంచాయతీకి మో బస్సు సేవా పథకంలో భాగంగా గురువారం బస్సును ప్రారంభించారు. కెరిమిటి పంచాయతీ నుంచి మొ బస్సు పథకంలో జబాపోదర్‌కు బస్సు వేయాలని ఆ ప్రాంత ప్రజలు చాలా ఏళ్లుగా కోరుతున్నారు. అయితే నేటి వరకు ప్రజల కోరిక తీరలేదు. మారుమూలనున్న జబాపోదర్ గ్రామానికి వెళ్లేందుకు ఎటువంటి రవాణా సౌకర్యం లేదు. ఇటీవల జబాపోదర్ గ్రామంలో జరిగిన ప్రసిద్ధ ఠకురాణి జాత్రకు వెళ్లిన కోట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్రను తమ పంచాయతీకి బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరారు. బస్సు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన కుంద్ర సమితి బీడీవో కపిలేశ్వర్ తండితో చర్చించి వెంటనే మొ బస్సు సేవా పథకంలో కెరిమిటి నుంచి జబాపోదర్ పంచాయతీకి బస్సు వేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశం మేరకు బస్సును ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుంద్ర సమితి ఎమ్మెల్యే ప్రతినిధి, బీజేపీ నేత బిప్రనారాయణ ఆచార్య, నాయకులు అభిలాష్ బెహర, ప్రకాశ పట్నాయక్, భగవాన్ పండ, తుషార్ భట్, దిగాపూర్ బీజేపీ మండల అధ్యక్షుడు ధనపతి పొరజ, లయిబాన్ గౌడ పాల్గొన్నారు. బస్సు సౌకర్యం కల్పించినందుకు కెరిమిట, జబాపోదర్ పంచాయతీల ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పెట్రోల్ బంకులో మోసాలపై ఆందోళన

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితిలోని పెట్రోల్ బంకులో మోసాలపై వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఓంకార్ బంకుకు వెళ్లిన బైక్‌లో కొద్దిగా పెట్రోల్ కొద్దిగా నీటిని నింపడాన్ని మరికొంతమంది వాహనాదారులు బుధవారం గమనించారు. దీంతో వాహనాలు ఆగిపోవడంతో గ్యారేజ్‌లో చూపించారు. సుమారు పది మంది వాహనాలు ఇలాగే ఆగిపోయాయి. వీరంతా మెకానిక్‌ను సంప్రదించగా.. పెట్రోల్‌లో నీరు కలిసినట్టు నిర్ధారించారు. దీంతో వారంతా బంక్ వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. బంక్ యజమాని నిలదీశారు. ఖాళీ బాటిళ్లలో పెట్రోల్ నింపి చూస్తే నీరు కలిసినట్టు నిర్ధారణ అయింది. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో వారంతా గురువారం బంకును పరిశీలించారు. నీరు కలిసిన పెట్రోల్ వేయడంతో ఆగిపోయిన వాహనాలను బాగు చేయించి ఇవ్వడంతోపాటు పెట్రోల్ కోసం డబ్బులను కూడా ఇచ్చారు. మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని బంక్ యజమానిని పోలీసులు హెచ్చరించారు.



నీటితో ఉన్న పెట్రోల్‌ను చూపిస్తున్న వాహనదారులు

స్వగ్రామంలో సామవేదం షణ్ముఖశర్మకు ఆత్మీయ సత్కారం



పర్లాకిమిడిలో దక్షిణ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సామవేదంకు సత్కారం

పర్లాకిమిడి: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సామవేదం షణ్ముఖ శర్మను దక్షిణ భారత బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. స్థానిక జంగం వీధి జంక్షన్ సింహాద్రి ఫంక్షన్ హాలులో సామవేదం షణ్ముఖ శర్మను దక్షిణ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఆర్.రవి, ఉపాధ్యక్షులు మరువాడ శివరామకృష్ణలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సామవేదం మాట్లాడుతూ తాను పుట్టింది గంజాం జిల్లా అస్కాలో అయినా నా విద్యాభ్యాసం పర్లాకిమిడి శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాలలో జరిగిందన్నారు. ఈ చారిత్రాత్మక ప్రాంతాన్ని ఒక నిర్దిష్టమైన వాస్తుశాస్త్రాన్ని అనుసరించి అప్పటి మహారాజులు నిర్మించారని అన్నారు. పర్లాకిమిడిలో దక్షిణ భారత బ్రాహ్మణ సంఘం, ఆత్మీయులు చాలా ఏళ్ల తర్వాత ఇలా కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఆత్మీయ సభలో వెల్లంకి కూర్మనాథం, కార్యదర్శి గుడిమెట్ల శ్రీనివాస రావు, చెట్టి వెంకటేశ్వర్లు తదితరులు సహకరించారు.

50 ఇళ్లలో అంధకారం

జయపురం: పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కమల పూజారి ఇంటితో పాటు మరో 50 ఇళ్లు అంధకారమయ్యాయి. ఆయా ఇళ్ల వారు బిల్లులు కట్టలేదని విద్యుత్ సరఫరా నిలుపు చేశారు. దీంతో ఈ నిరుపేద ఆదివాసీలు అంధకారంలో ఉంటున్నారు. కమల పూజారి గ్రామం జయపురం సమితి పాత్రోపుట్. మూడేళ్ల కిందట ఆ గ్రామంలోను పక్కన ఉన్న కొంజాయి మాలిగుడ గ్రామాల్లో రాజీవ్ గాంధీ విద్యుద్దీకరణ పథకం అమలు చేశారు. ఆ మేరకు పాత్రొపుట్‌లో 50 ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఆ నాడు ఒక బల్బుకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించారు.



పద్మశ్రీ కమల పూజారి ఇల్లు



కమల పూజారి కుటుంబం

కానీ ఇప్పుడు వేలకు వేలు బిల్లులు రావడంతో గిరిజనులు కంగారు పడుతున్నారు. తాము అంత డబ్బు కట్టలేమని చెప్పినా వినకుండా విద్యుత్‌శాఖాధికారులు కరెంటు సరఫరా నిలిపివేశారు. ఈ ఇళ్లలో పద్మశ్రీ డాక్టర్ కమలా పూజారి కుటుంబానికి చెందిన ఇల్లు కూడా ఉంది. అలాగే కొంజాయిమాలిగుడలో 12 ఇళ్లకు విద్యుత్ సరఫరా కట్ చేశారు. ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని ఆనాడు చెప్పిన అధికారు నేడు బిల్లు కట్టలేదంటూ విద్యుత్ సరఫరా నిలిపి వేయటం అన్యాయమని అన్నారు.

ఈ అంశంపా బీజేడీ తీవ్రంగా స్పందించింది. వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించక పోతే బీజేడీ ఆందోళనన చేపడుతుందని మాజీ మంత్రి రబినారాయణ నందో హెచ్చరించారు.

క్లుప్తంగా

కింగ్‌కోబ్రా హల్‌చల్



కింగ్ కోబ్రాను పట్టుకున్న మహాపాత్రో

మందస: మందస మండలం భోగాపురం గ్రామంలోని హరిజనవీధి ఎంపీపీ స్కూల్ సమీపంలో గురువారం తెల్లవారు జామున భారీ కింగ్ కోబ్రా కలకలం రేపింది. దాదాపు 12 అడుగులు ఉన్న సర్పాన్ని చూసి స్థానికులు భయపడ్డారు. పిల్లలు చదువుకుంటున్న ప్రదేశంలో పాము కనిపించడంతో వణికిపోయారు. కొర్లాం గ్రామంలో ఉన్న స్నేక్ క్యాచర్ నర్సింగ్ మహా పాత్రోకు సమాచారం అందించగా ఆయన వచ్చి సర్పాన్ని పట్టుకుని అడవుల్లో విడిచిపెట్టారు.

రాష్ట్ర కార్యక్రమంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు నగరంలోని మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం, శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులో నూతనంగా నిర్మించిన బీసీ భవన్‌ను ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు.

పురుషోత్తపురంలో తగ్గుతున్న డయేరియా



కాలువలో చెత్త

ఇచ్ఛాపురం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురంలో డయేరియా గురువారానికి తగ్గుముఖం పట్టింది. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి జూహితా, ఇతర సిబ్బంది ఇంటింటా సర్వే చేసి వైద్య సేవలు అందజేశారు. పురుషోత్తపురంలో బావి నీరు ఉపయోగిస్తున్నారని, ఆ బావిలో చెత్త వేయకుండా చూసు కోవాలని వైద్యాధికారి జూహితా తెలిపారు. అయితే గ్రామంలో బహిరంగ మలవిసర్జన సమస్యగా ఉందని, దాన్ని అరికట్టాలని కొందరు కోరారు. కాలువల్లోనూ మురికి పేరుకుపోయి ఉందని తెలిపారు.

టెక్కలి నూతన డీఎస్పీగా భార్గవి

శ్రీకాకుళం క్రైమ్, టెక్కలి: టెక్కలి నూతన డీఎస్పీగా ఎన్.భార్గవి మర్రివాడ రానున్నారు. ఇటీవల శిక్షణ పూర్తిచేసుకున్న ఈమె టెక్కలిలో తొలిపోస్టింగ్ దక్కించుకోవడం విశేషం. ఈ మేరకు మంగళగిరి డీజీపీ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వచ్చాయి. టెక్కలిలో ఇదివరకు పనిచేసిన డీవీవీఎస్ఎన్ మూర్తి ఇటీవల ఉద్యోగవిరమణ పొందిన విషయం విదితమే.

ఆర్టీసీ డ్రైవర్ ఆవేదన

సాక్షి టాస్క్‌ఫోర్స్: జలుమూరు మండలం పెద్దదూగాం గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ధర్మాన రామారావు తాను మోసపోయానని, తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ వీడియో విడుదల చేశారు. బుద్దల భాస్కరరావు అనే వ్యక్తి తనను మోసం చేశాడని ఆయన ఆరోపించారు. విడతల వారీగా రూ.68 లక్షల వరకు కాజేశాడని, పిల్లల చదువులకు ఇప్పుడు తాను ఇబ్బందులు పడుతున్నానని వీడియోలో పేర్కొన్నారు. తన లాగానే పరిసర గ్రామాల ప్రజల వద్ద కూడా డబ్బులు వసూలు చేశాడని, కూతురి పెళ్లి కోసం ఉంచుకున్న డబ్బును సైతం అతడికే ఇచ్చేశానని ఆవేదన వ్యక్తం చేశారు. తన లాగా భాస్కరరావు మాయలో ఎవరూ పడవద్దని కోరారు. ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశానని, తనకు పోలీసులు న్యాయం చేయాలని, ఇది కేవలం తన వ్యక్తిగత సమస్య అని రాజకీయాలకు సంబంధం లేదని తెలిపారు.

ఉత్సాహంగా సరస్వతి శిశు మందిర్ వార్షికోత్సవం



నృత్య ప్రదర్శనలో చిన్నారులు



వేదికపై అతిథులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాల 26వ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సంగ్ మడ్కామి కార్యక్రమంలో పాల్గొన్నారు. 1995లో ప్రారంభమైన సరస్వతీ శిశుమందిర్ ఎంతోమందిని ఉత్తములుగా తీర్చిదిద్దింది. 2023–24 విద్యాసంవత్సరంలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 498 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని లిప్సరాణి పండాకు వెయ్యి రూపాయల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. జిల్లా అదనపు కలెక్టర్ సోమానాథ్ ప్రధాన్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సమారి టంగులు, పాఠశాల కమిటీ అధ్యక్షుడు ఆశోక్ చక్రవర్తి పాల్గొన్నారు.

కళలు, సంస్కృతిని పరిరక్షించాలి

● జిల్లా కలెక్టర్ పట్వారి



సీనియర్ కళాకారులతో కలెక్టర్ పట్వారి, అధికారులు

రాయగడ: భిన్న సంస్కృతులు గల ఒడిశా రాష్ట్రం కళలకు పుట్టినిల్లని జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి అన్నారు. వీటిని కాపాడుకోవడం మన కర్తవ్యమని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అవతరణ ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక సంస్కృతి భవనంలో కళాకారుల సన్మాన కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎంతో మంది కళాకారులు ఉన్నారని, వారిని ప్రోత్సాహించేందుకు జిల్లా యంత్రాంగం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కళలనే నమ్ముకున్న సీనియర్ కళాకారులను సన్మానించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టిందన్నారు. కళారంగం ఎప్పటికీ అలరించాలని, అందుకు కళాకారులను ప్రోత్సాహించడం మనందరి కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంస్కృతి విభాగం అధికారి సస్మిత భౌరి, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్, జిల్లా కళాకారుల సంఘం ఉపాధ్యాక్షులు సంతోష్ కుమార్ బొచ్చా, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



దొంగిరియా నృత్య ప్రదర్శనలో కళాకారులు

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



సందీప్ లెంక (ఫైల్)

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో గల గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయంలో చదువుతున్న సందీప్ లెంక అనే విద్యార్థి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కేంద్రపడ జిల్లాలోని రాజ్‌నగర్ ప్రాంతానికి చెందిన వాడు. సమాచారం తెలుసుకున్న గుణుపూర్ ఆదర్శ పోలీస్ స్టేషన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో గల న్యూటన్ విభాగం హాస్టల్‌లో 24 వ నంబరు గదిలో సందీప్ ఉండేవాడు. బుధవారం కాలేజీలో ఫైనల్ ఇయర్ విద్యార్థుల వీడ్కోలు సభ జరిగింది. ఆ కార్యక్రమానికి కూడా సందీప్ హాజరు కాలేదు. సందీప్ ఉంటున్న గదిని శుభ్రం చేసేందుకు ఓ మహిళ వెళ్లి తలుపు కొట్టగా ఏమీ సమాధానం రాలేదు. దీంతో ఆమె వెంటనే వార్డెన్‌కు విషయం తెలియజేశారు. అనంతరం హాస్టల్ వార్డెన్, యాజమాన్య సిబ్బంది వెళ్లి గది తలుపులను విరగ్గొట్టి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ సందీప్ కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద హరిరావు, తదితరులు

జయపురం: ఎండలు తీవ్రంగా ఉంటున్నాయని, పట్టణానికి వచ్చే గ్రామీణులు, స్థానికులు ఎండలో సేద తీరేందుకు జయపురం పట్టణ ప్రధాన సెంటర్లలో తాత్కాలిక రెస్ట్ షెడ్లు ఏర్పాటు చేయాలని ప్రముఖ సమాజ సేవకుడు బి.హరి రావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. జయపురం సబ్‌కలెక్టర్ అక్కవరం శొశ్యారెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ప్రధాన ట్రాఫిక్ జంక్షన్‌లలో డిజిటల్ సిగ్నల్ లైట్ ఉందని, వాహనాలు దాదాపు ఒక నిముషం వరకు వేచి ఉండాల్సి వస్తుందన్నారు. అధికంగా ఎండలు ఉండటం వలన ప్రజలు వడ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. 2024లో మున్సిపాలిటీ అధికారులు ఆ ప్రాంతంలో రెస్ట్ షెడ్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. వినతి పత్రం అందజేసినవారిలో రమేష్ జెనా, కె.గురు పట్నాయక్, బలరాం నాయక్, కమల లోచన, తదితరులు ఉన్నారు.

అంత్యోదయ ఆవాస్ యోజనలో చేర్చుతాం



రాజేశ్వరిని కలిసిన ఎమ్మెల్యే బొత్ర



సుదాంశును కలిసిన ఎమ్మెల్యే బొత్ర

● కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు బొత్ర

జయపురం: అంత్యోదయ ఆవాస్ యోజనలో లబ్ధి పొందని ముగ్గురు అర్హులను కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు బొత్ర గురువారం కలిశారు. కుంద్రా సమితి కలియకదర్ గ్రామానికి వెళ్లి అంత్యోదయ ఆవాస్ యోజనలో అర్హత ఉండి లబ్ధిపొందలేక పోయిన కవితా నాయక్, రాజేశ్వరీ నాయక్, సువాగుడ గ్రామం సుదాంశు రంజన్ మిశ్రను కలిశారు. వీరికి అంత్యోదయ ఆవాస్ యోజనలో చేర్చుతానని హామీ ఇచ్చారు. సమితి అధికారులు లబ్ధిదారుల జాబితాను రూపొందించారు. మార్చి 30వ తేదీన వారందరికీ అంత్యోదయ అవాస్ యోజన ఇళ్లు మంజూరు ఆర్డర్లు అందజేశారు. అందులో వీరి ముగ్గురు పేర్లు చోటు చేసుకోలేదు. సుదాంశు ఎంతో కాలంగా గుర్తు తెలియని వ్యాధితో బాధపడుతున్నారు. రాజేశ్వరి పక్షవాతం వ్యాధి గ్రస్తురాలు. కవిత నాయక్ థలసేమియా వ్యాధిగ్రస్తురాలు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శన



కళాకారులను అభినందిస్తున్న బీడీవో గౌరచంద్ర పట్నాయక్



లోకకళాకారులను అభినందిస్తున్న అతిథులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి అగరఖండి పంచాయతీ బోడోగావ్ కళాకారుల పుట్టినిల్లు. అగరఖండి గ్రామంలో కళాకారులు గురువారం లోకకళా ప్రదర్శన ఇచ్చారు. ఒడియా భాషా ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్, గౌరవ అతిథిగా ఎ.డి.ఎం.రాజేంద్రమింజ్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, బీడీవో గౌరచంద్ర పట్నాయక్, గుసాని సమితి చైర్మన్ ఎస్.వీర్రాజు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను కల్చరల్ అధికారి అర్చనా మంగరాజ్ పర్యవేక్షించగా, డీపీఆర్వో ప్రదిప్త గురుమయి ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మద్యం దుకాణం



సబ్ కలెక్టర్ అనుప్ పండాకు వినతిపత్రం అందజేస్తున్న గోవిందపూర్ గ్రామస్తులు

పర్లాకిమిడి: జిల్లాలో మోహనా బ్లాక్ గోవిందపూర్‌లో ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల వద్ద దేశీ, విదేశీ మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. దీంతో ఆ గ్రామస్తులు గురువారం గజపతి కలెక్టర్ బిజయకుమార్ దాస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను, సబ్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలను అందజేశారు. నలుగురు సారా వ్యాపారులు ఏర్పాటు చేసిన నాటు సారా, విదేశీ మద్యం దుకాణాన్ని తొలగించాలని కోరారు.

'ఆపరేషన్ కగార్ ఆపాల్సిందే'



మాట్లాడుతున్న విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ

పలాస: దండకారణ్యంలో ఆపరేషన్ కగార్‌ను కేంద్ర, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిలుపుదల చేయాలని, కేంద్ర పోలీసు బలగాలను వెనక్కి రప్పించాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని పలువురు వక్తలు ప్రభుత్వానికి విన్నవించారు. కాశీబుగ్గలోని ఓ రెసిడెన్సీలో గురువా రం సీపీఐ ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా సదస్సు నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ మాట్లాడుతూ దండకారణ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మావోయిస్టుల పేరుతో ఆదివాసీలపై దాడులు జరుగుతున్నాయని, అమాయక ప్రజలు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పోలీసుల చేతిలో మృతి చెందిన రేణుక బహుజనుల బిడ్డని, ఆమె ఎప్పుడు కూడా తుపాకీ పట్టిన దాఖలాలు లేవని, ఆమె ఒక రచయిత, మేధావి అని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా ప్రకృతి వనరులను దోచుకోవడానికేనని దుయ్యబట్టారు. మానవ హక్కుల నేత ఎస్వీ కృష్ణ మాట్లాడుతూ అడవుల్లో ఉన్న ఖనిజ సంపదను కొల్లగొట్టడానికి మాత్రమే ఈ ఆపరేషన్ కగార్ అని వ్యతిరేకించారు. సదస్సులో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు కేవీ జగన్నాథం, సీపీఐ ఎం.ఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, పత్రి దానేసు తదితరులు పాల్గొన్నారు.

పాత్రోపుట్ అడవిలో పోడు వ్యవసాయం కోసం అడవులు తగుబెట్టిన దృశ్యం



అడవుల్లో అగ్ని సెగలు



కొండమాలిలో కాలుతున్న అడవి

జయపురం: జయపురంలో ఎండలు మండుతున్నాయి. జయపురం అటవీ రేంజ్‌లో గత ఫిబ్రవరి 12 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు 23 చోట్ల అడవులు అగ్ని ప్రమాదాల్లో చిక్కుకుని తగలబడినట్లు తెలుస్తోంది. ఈ వేసవిలో అగ్ని ప్రమాదాల నుంచి అడవులను కాపాడేందుకు 8 స్వచ్ఛంద సంస్థలకు అటవీ విభాగం బాధ్యతలు అప్పగించింది. అయినా అడవుల్లో అగ్ని ప్రమాదాలు తగ్గటం లేదు. గత ఫిబ్రవరి నెలలో జయపురం అటవీ రేంజ్‌లో 3 ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరుగగా మార్చ్ నెలలో 9 అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఈ నెల అనగా ఏప్రిల్ 1 వ తేదీన రెండు ప్రాంతాల్లో అడవులు తగులబడగా, ఏప్రిల్ 5 వ తేదీన రెండు ప్రాంతాలలోను, 6న ఒక ప్రాంతంలోను, 7న ఒక ప్రాంతంలోను, 8న 5 ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినట్లు తెలిసింది. మంగళవారం బరిణిపుట్ పంచాయతీ మహుంళభట రిజర్వ్ ఫారెస్టులు రెండు చోట్ల, కొండమాలి రిజర్వ్ ఫారెస్టులు రెండు చోట్ల, బులెట్ షోరూం వెనుక వైపున ఉన్న అడవిలో అగ్ని ప్రమాదాలు జరిగినట్లు జయపురం అటవీ రేంజర్ పారిడ వెల్లడించారు.

కిడ్నీ ఆస్పత్రి పరిశీలన



మాట్లాడుతున్న డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాసలోని వైఎస్సార్ కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గురువారం పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామారావు అనే బాధితుడిని పరామర్శించేందుకు వచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజతో కలిసి ఇన్‌పేషెంట్ విభాగం, కిడ్నీ రోగుల వార్డు, ప్రభుత్వ డయాలసిస్ యూనిట్లను పరిశీలించారు. రోజు రోజుకూ కిడ్నీ రోగులు పెరుగుతున్నారని వారికి అవసరమైన వైద్య సేవలు, మందులు పంపిణీ, ఆపరేషన్‌లు, పరీక్షలు, అన్ని విభాగాలను పనిచేసేలా చూడాలని అన్నారు. ఆయనతో పాటు మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, ఎంపీటీసీలు బమ్మిడి దుర్యోధన రావు, గండు మోహనరావు, మాజీ ఎంపీపీ బత్తిని హేమేశ్వరరావు, నాయకులు శిష్టు గోపి, దువ్వాడ రవి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీవ్యాధితో వ్యక్తి మృతి



టెక్కలి రూరల్: మండలంలోని సన్యాసినీతాపురం గ్రామానికి చెందిన బెహరా సింహాద్రి(45)అనే వ్యక్తి కిడ్నీవ్యాధితో గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు గత కొన్ని సంవత్సరాలుగా కిడ్నీవ్యాధితో బాధపడుతూ శ్రీకాకుళం, టెక్కలిలోని ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకునేవాడు. అయితే గత రెండు రోజులుగా తీవ్ర అనారోగ్యానికి గురవ్వడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య కృష్ణవేణి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

పండితులకు సత్కారం



ఆదిత్యుని వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి సన్నిధిలో గురువారం ఉదయం పండిత సదస్సు, మహాదాశీర్వచనాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఈఓ/డిప్యూటీ కమిషనర్ వై.భద్రాజీ వేదపండితులందరీని ఘనంగా సత్కరించారు. భజంత్రీలు వాయించే నాయీ బ్రాహ్మణులను కూడా సన్మానించారు. - అరసవల్లి

● దిగితే భయోత్పాతం



పూండి రైల్వేస్టేషన్‌లో మధ్య ట్రాక్‌కు ప్లాట్‌ఫారం లేదు. రాత్రివేళ ఈ ట్రాక్‌పై రైలు ఆగితే దిగడానికి ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రధానంగా రాత్రి 10 గంటల సమయంలో విశాఖ నుంచి బ్రహ్మపూర్ వెళ్లే డీఎంయూ రైలు, వేకువ జామున 5.30 గంటలకు గుణుపూర్ నుంచి కటక్ వెళ్లే ఎంఈఎంయూ పాసింజర్ రైళ్లు ఈ ట్రాక్‌పై ఆపుతుంటాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గత పదేళ్లుగా ఇదే పరిస్థితి. – వజ్రపుకొత్తూరు

రేషన్ బియ్యం పట్టివేత



పోలాకి: మండలంలోని చీడివలన గ్రామంలో పాట్నూరు అప్పన్న ఇంటివద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 2.6 క్వింటాళ్ల రేషన్ బియ్యంను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్ఓ సూర్యప్రకాశ రావు, సీఎస్‌డీటీ రామకృష్ణ కచ్చితమైన సమాచారం మేరకు అక్కడకు చేరుకుని బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు డీఎస్ఓ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

క్లుప్తంగా

క్షయ రోగుల కుటుంబ సభ్యులకు పరీక్షలు

- జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి



స్కిన్‌టెస్టును పరిశీలిస్తున్న డాక్టర్ రాణి

విజయనగరం ఫోర్ట్: క్షయ రోగుల కుటుంబసభ్యులకు క్షయ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి తెలిపారు. ఈ మేరకు స్థానిక అరుంధతి నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ రోగుల కుటుంబసభ్యులకు చేస్తున్న స్కిన్ (సీ వై-టీబీ) టెస్టును గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షయ రోగుల కుటుంబసభ్యులకు స్కిన్ టెస్టు చేయనున్నామని చెప్పారు. 48 నుంచి 72 గంటల్లో ఈ పరీక్ష రిజల్ట్ వస్తుందన్నారు. ఈ పరీక్షలో 5ఎంఎంగా నిర్ధారించిన ఎడల టీబీ ప్రివెంటివ్ థెరపీ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు అర్చన దేవి, అశోక్ పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు ఆవుదూడలు



ఆవు, దూడలను పరిశీలిస్తున్న పశువైద్యశాఖ ఎ.డి చంద్రశేఖర్ తదితరులు

గజపతినగరం: మండల కేంద్రంలోని ఎం.వెంకటాపురం గ్రామానికి చెందిన మార్కెట్ యార్డు చైర్మన్ పీవీవీ గోపాల రాజు జెర్సీ ఆవు ఒకే ఈతలో రెండు జెర్సీ ఆడపెయ్యలకు జన్మనిచ్చింది. ఈ విధంగా కవలలు పుట్టడం చాలా అరుదని స్థానిక పశువైద్య శాఖ ఎ.డి చంద్రశేఖర్ అన్నారు. గురువారం పీవీవీ గోపాల రాజుకు చెందిన ఆవు, దానికి పుట్టిన రెండు ఆడపెయ్యలు ఆరోగ్యంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించానని ఎ.డి చంద్రశేఖర్ తెలిపారు. ఒకే ఈతలో జన్మించిన ఆవుపెయ్యిలను పలువురు ఆసక్తిగా తిలకించారు.

రూ.కోటి 72 లక్షల విలువైన సిగరెట్లు సీజ్

- శ్రీకాకుళం, విజయనగరం, జిల్లాల విజిలెన్స్ ఎస్పీ



సిగరెట్లు స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

విజయనగరం క్రైమ్: ఎలాంటి ట్యాక్స్‌లు చెల్లించకుండా ఒడిశా నుంచి ఏపీలోకి వచ్చిన రూ.కోటి 72 లక్షల విలువ గల సిగరెట్లను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. విజయనగరంలోని ఎంవీఆర్‌జీఆర్ కాలేజ్ సమీపంలో గల సూర్య లేఅవుట్‌లో సుంకర పేట వద్ద ఓ గోడౌన్‌లో సిగరెట్లు డంప్ చేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ వ్యాన్‌లో అగ్గిపెట్టెలు బిల్లులతో రవాణా చేస్తున్నట్లు తొలుత తమకు సమాచారం అందిందన్నారు. అయితే మ్యాచ్‌బాక్స్ బిల్లు పేరుతో 3 లక్షల 16 వేల సిగరెట్ బాక్స్‌లు సరఫరా చేస్తున్నారని, తర్వాత అందిన సమాచారంతో సూర్య లే అవుట్ వద్ద ఉన్న ఓ గొడౌన్‌లో దాడి చేసి వ్యాన్‌లో ఉన్న సిగరెట్ల లోడును స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.

నిరాదరణకు గురైన బాలికకు సంరక్షణ




బాలికను వసతి గృహంలో చేర్చుతున్నట్లు మాజీ ఎంపీ ప్రదీప్ కుమార్ దేవ్‌కు లేఖను అందజేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండల కేంద్రంలోని శివన్నపేట గ్రామంలో నిరాదరణకు గురైన 11 ఏళ్ల బాలికను మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ కుమార్ దేవ్ చొరవతో..మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.కనకదుర్గ ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ అధికారులు బాలబాలికల వసతి గృహానికి గురువారం తరలించారు. తల్లిదండ్రులు వదిలేసిన ఓ బాలిక శివన్నపేటలో తిరుగుతూ ఎవరైనా తినడానికి ఇస్తే తింటూ..రోజుకో ఇంటి గడపలో తలదాచుకుంటోందన్న సమాచారాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న మాజీ ఎంపీ ప్రదీప్ కుమార్ దేవ్ బాలిక సంరక్షణ నిమిత్తం ఐసీడీఎస్ పీడీ కనకదుర్గకు తెలియజేశారు. దీనిపై స్పందించిన పీడీ ఆ బాలికను బాలబాలికల వసతి గృహంలో చేర్పించాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణకు ఆదేశించగా..ఆయనతో పాటు జిల్లా లీగల్ ఆఫీసర్ పి.శ్రీధర్ బాలికతో మాట్లాడి ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచి, వారి సూచనల మేరకు వసతి గృహంలో చేర్పించారు. కార్యక్రమంలో కురుపాం మహిళా సంరక్షణ అధికారి రోజారాణి, ఐసీడీఎస్ సిబ్బంది ఉన్నారు.

విలక్షణం.. అడవి బిడ్డల జీవనం

చుట్టూ కొండలు..జలపాతాలు..రాళ్లురప్పలు..పచ్చని ప్రకృతి..శబ్ద, వాయు కాలుష్యం కానరాని ప్రాంతం..ఆరోగ్యంగా జీవనం సాగించే గిరిజనం..ఎక్కడో దూరాన విసిరేసేలా ఉండే ఊళ్లు..ఇంకా అమాయకత్వాన్ని వీడని మోములు..రాయనక..రప్పనక..ఎండనక..వాననక..అడవి తల్లినే నమ్ముకున్న జీవితాలు..తరాలు గడిచినా..వారి జీవితం విలక్షణమే..పేరుకు జిల్లా కేంద్రంలో ఉన్నా సరే..వారింకా అడవిబిడ్డలే. పార్వతీపురం మండలంలోని తొక్కుడువలస, సీతంపేట, తాన్నవలస తదితర గిరిజన గ్రామాల్లోని ప్రజల జీవన చిత్రాలివి.

–పార్వతీపురం రూరల్



కొండల మధ్యన విసిరేసినట్లు ఉన్న తాన్నవలస గ్రామం



అడవి నుంచి కట్టెలు మోసుకొస్తున్న యువతి



సీతంపేటలో చంకలో చంటిబిడ్డలతో గిరిజన మహిళలు



ఇదే మీటింగ్ హాల్: ఓ చోట కూర్చుని నలుగురూ కలిసి బాతాఖానీ



ఈ తెలివి మాకే సొంతం: ఓవైపు పశువులకు నీడలా.. మరోవైపు కావాల్సిన గడ్డిని అవే తీసుకునేలా సీతంపేటలో గిరిజనులు చేసిన ఏర్పాటు



అమ్మానాన్న అడవికి: నేనేమో ఆటకు..



ఎవరో వచ్చారే: ఇంటి వసారాలో నుంచి భయంగా చూస్తున్న గిరిబాలలు



తగ్గేదేలే: మోడల్ ద్విచక్ర వాహనంతో రయ్‌మని దూసుకుపోతున్న గిరిజనుడు



గిరిజన మహిళ



అడవినుంచి జీడిపళ్లు ఏరుకుని వస్తున్న గిరిజన మహిళ

ప్రతి కుటుంబం లక్ష ఆదాయం పొందాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలోని ప్రతికుటుంబం కనీసం రూ.లక్ష ఆదాయం పొందాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల నుంచి జీవనోపాధి కల్పనలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో గురువారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం కనీసం రూ.లక్ష ఆదాయం సంపాదించాలని ఇందుకు వ్యవసాయ, ఉద్యాన పంటలు, పశుసంవర్ధక సంబంధిత ఆవులు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకాల యూనిట్ల ఏర్పాటు వల్ల పొందే ఆదాయ మార్గాలపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. జిల్లాలో 110 ఎకరాల్లో పనస పంట వేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఒక కుటుంబం రూ.లక్ష ఆదాయం పొందేందుకు అవసరమైన పెట్టుబడి, వేతనాలు, చెల్లింపు, ఖర్చులు తదితర అంశాలతో స్పష్టమైన కార్యాచరణ రూపొందించి ప్రణాళికాబద్ధంగా అమలు చేయడం వల్ల వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి డీఎస్ దినేష్ కుమార్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి, జిల్లా ఉద్యానశాఖాధికారి బి. శ్యామల, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వి.రాధాకృష్ణ, జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ అధికారి అశోక్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

మృతిచెందిన పోలీసు కుటుంబానికి 'చేయూత'



మృతుడి భార్య శారదకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: పోలీస్‌శాఖలో ఇటీవల అకాల మరణం చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి ఎస్పీ వకుల్ జిందల్ 'చేయూత' కింద ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు శాఖలో పనిచేస్తున్న సిబ్బంది పోగు చేసిన రూ.లక్షా, 48 వేల మొత్తాన్ని గురువారం మృతుడి కుటుంబానికి అందజేశారు. శాఖలో ఏ ఒక్కరైనా అనారోగ్యంతో మృతి చెందితే పోలీస్‌శాఖ చేయూత ద్వారా ఆదుకుంటుందని ఎస్పీ ఈ సందర్భంగా అన్నారు. ఇందుకోసం శాఖలో సిబ్బంది అంతా ప్రతినెలా కొంత సొమ్ము పోగు చేస్తున్నారని చెప్పారు. మార్చి 8న ఏఆర్ విభాగానికి చెందిన కానిస్టేబుల్ సీహెచ్.గోపాలరావు అనారోగ్యంతో మృతి చెందారని, ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు 'చేయూత' ద్వారా చెక్కును మృతుడి భార్య సీహెచ్ శారదకు అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం, కుటుంబంలో ఒక్కరు ఉద్యోగం పొందేందుకు అవసరమైన సర్టిఫికెట్లు డీపీఓలో అందజేయాలని ఎస్పీ ఈ సందర్భంగా మృతుడి కుటుంబసభ్యులకు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, డీపీఓ ఏఓ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రామకృష్ణ, ఆర్ఐ గోపాలనాయుడు, పోలీస్ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బాలింత మృతి

- పసర వైద్యమే కారణమా?



మరణించిన సేవి లక్ష్మి

సాలూరు: పాచిపెంట మండలంలోని గిరిశిఖర మోదుగ పంచాయతీ గ్రామానికి చెందిన గిరిజన బాలింత సేవి లక్ష్మి(30) మరణించింది. గురువారం ఉదయం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి అంబులెన్స్‌లో ఆమెను తీసుకురాగా ఆస్పత్రిలో బెడ్ మీద వేయగానే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లక్ష్మి సుమారు రెండు నెలల క్రితం మూడవ బిడ్డకు జన్మనిచ్చింది. ఇటీవల ఆమె అనారోగ్యానికి గురికాగా పాచిపెంట సీహెచ్‌సీకి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. ఒకరోజు వైద్యం తరువాత ఆమెను మళ్లీ గ్రామానికి తీసుకువెళ్లారు. అయితే ఆమెకు పచ్చకామెర్లు వచ్చాయని పసర వైద్యం చేయించినట్లు తెలియవస్తోంది. దీంతో ఒళ్లంతా వాపులు రావడంతో సాలూరు ఏరియా ఆస్పత్రికి గురువారం ఉదయం తీసుకువచ్చారు. దీనిపై ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షిని వివరణ కోరగా, గురువారం ఉదయం ఆస్పత్రికి ఆమెను తీసుకువచ్చారని, బెడ్ మీద వేసిన కొన్ని నిమిషాల్లోనే మరణించిందన్నారు. సెప్టిక్‌షాక్ విత్‌మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగా మృతిచెందినట్లు చెప్పారు. ఆమెకు పచ్చకామెర్లు రావడంతో ఇంటివద్ద పసర వైద్యం చేయించామని బంధువులు చెప్పారన్నారు.

బాత్‌రూమ్‌లో పడి వ్యక్తి మృతి

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



కోరాడ సూర్యనారాయణ అలియాస్ సురేష్ (ఫైల్)

పార్వతీపురం రూరల్: పట్టణంలోని వివేకానంద కాలనీలో బాత్‌రూమ్‌లో పడి ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు పట్టణ పోలీసులు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన కోరాడ సూర్యనారా యణ (46)అలియాస్ సురేష్ అనే వ్యక్తి ఈనెల 8న తన స్వగృహంలో ఉన్న బాత్‌రూమ్‌లో పడి మృతిచెందాడు. గురువారం దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీస్ సిబ్బంది వచ్చి పరిశీలించి సూర్యనారాయణ మృతిచెందినట్లు నిర్ధారించి కుటుంబసభ్యులకు సమాచామందించగా ఉగాది రోజున కన్నవారి ఇంటికి వెళ్లిన భార్య హుటాహుటిన వచ్చింది. ఉగాది రోజున భార్య ఊరికి వెళ్లగా సూర్యనారాయణ ఒక్కడే ఇంటిలో ఉంటూ మద్యం తాగిన మత్తులో బాత్‌రూమ్‌లో పడిపోయి ఉంటాడని స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.మురళీధర్ తెలిపారు. మృతునికి ఒక కుమార్తె ఉంది.

పింఛన్ కోసం ఎదురుచూస్తూ..

- ఆకలితో అలమటించి..
- మరణించిన గిరిజన వితంతువు
- కూటమి ప్రభుత్వంపై స్థానికుల మండిపాటు



మరణించిన గిరిజన వృద్ధురాలు వంజరపు అన్నపూర్ణ

సాలూరు/సాలూరు రూరల్ : ఏ ఆధారం లేని తనకు పింఛన్ సొమ్ము వస్తే జీవనం సాఫీగా సాగించవచ్చని భావించింది. తొమ్మిదినెలలు దాటినా ఆ ఎదురుచూపులు అలాగే మిగిలిపోయాయి. చివరకు పింఛన్ మంజూరు కోసం ఎదురుచూస్తూ.. ఆకలితో అలమటించి ఓ గిరిజన వితంతువు తనువుచాలించిన హృదయ విదారక సంఘటన గిరిజన సంక్షేమ శాఖామంత్రి, స్త్రీశిశుసంక్షేమశాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న సాలూరు నియోజకవర్గంలో బుధవారం జరిగింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సాలూరు మండలంలోని కూర్మరాజుపేట పంచాయతీ గ్రామానికి చెందిన గిరిజన వృద్ధురాలు వంజరపు అన్నపూర్ణ (62) పింఛన్ కోసం తిరుగుతూ, ఆకలితో అలమటిస్తూ బుధవారం రాత్రి తనువు చాలించింది. ఆమె భర్త కన్నయ్యకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పింఛన్ వచ్చేది. అయితే 2023 డిసెంబరు 6న కన్నయ్య మరణించాడు. భర్త మరణించిన కారణంగా తనకు పింఛన్ మంజూరుచేయాలని ఆమె స్థానిక సచివాలయానికి వెళ్లింది. అయితే ఆమెకు ఫింఛన్ మంజూరయ్యేలోపు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మంజూరు కాలేదు. తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు సుమారు 9నెలలు కావస్తున్నా నేటికీ ఆమెకు పింఛన్ మంజూరు చేయలేదు. దీంతో ఆ ఒంటరి వృద్ధురాలికి స్థానికులు సాయం చేయగా పొట్ట పోషణ చేసుకునేది. ఈ క్రమంలో పింఛన్ సొమ్ము రాక, ఆకలితో అలమటిస్తూ బుధవారం తనువుచాలించింది. ఈ హృదయ విదారక సంఘటనతో స్థానికులు భావోద్వేగానికి లోనయ్యారు.

వితంతువులతో రాజకీయమా..?

ఇటువంటి సంఘటనల నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడాది నవంబర్ నుంచి పింఛన్ తీసుకుంటున్న భర్త మరణిస్తే భార్యకు వెంటనే పింఛన్ మంజూరుచేయాల్సి ఉంది. కూటమి పాలనలో భర్త మరణించినా భార్యకు వితంతు పింఛన్ మంజూరు కాకపోవడంతో సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు గాలికొదిలేసిన పాలకులు వితంతువుల పట్ల కూడా ఇంత స్వార్థపూరిత రాజకీయాలు చేస్తారా? అంటూ కూటమి ప్రభుత్వ వికృత చర్యలపై మండిపడుతున్నారు.

ఇది దారుణం



కూర్మరాజుపేటలో గిరిజన వృద్ధురాలు వంజరపు అన్నపూర్ణమ్మ పింఛన్ మంజూరుకాక కుటుంబపోషణకు ఆధారం లేక ఆకలితో మరణించడం చాలా బాధాకరం. ఇది నన్ను బాగా కలిచివేసింది. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో ఇటువంటి వారు లక్షల్లో ఉండొచ్చు. వారు మనుషులు కాదా? వారి కష్టాలు నేటి పాలకులకు పట్టకపోవడం అత్యంత శోచనీయం. ఇకనైనా ప్రభుత్వం ఈ విషయంపై వెంటనే ఆలోచించి, అర్హులందరికీ పింఛన్లు అందించాలి.

–పీడిక రాజన్నదొర, మాజీ డిప్యూటీ సీఎం

లైంగిక దాడి కేసులో ముద్దాయికి జైలుశిక్ష

విజయనగరం క్రైమ్: 2021లో విజయనగరంలో మహిళను మోసగించి, లైంగికదాడికి పాల్పడిన ముద్దాయికి ఏడాది జైలు శిక్ష, రూ.పదివేలు జరిమానా విధిస్తూ విజయనగరం మహిళా కోర్టు 5వ ఏడీజే, తీర్పు ఇచ్చినట్లు మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరసింహమూర్తి తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆయన తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని దాసన్నపేటకు చెందిన మొయిద పైడిరాజు ఓ మహిళను నమ్మించి, మోసగించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధిత మహిళ 2021లో అప్పటి దిశ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై శ్యామల దేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి దిశ డీఎస్పీ త్రినాథ్ నిందితుడ్ని అరెస్ట్ చేసి అభియోగపత్రాలు కోర్టులో దాఖలు చేశారు. నాలుగేళ్ల విచారణ అనంతరం నేరారోపణ రుజువు కావడంతో మహిళా న్యాయమూర్తి పద్మావతి ముద్దాయి నాగరాజుకు పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

డీఎస్సీ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ సీహెచ్ హరీష్

విజయనగరం గంటస్తంభం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వివిధ రకాల కారణాల చెబుతూ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం చేయడం తగదని డీవైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ సీహెచ్.హరీష్ అన్నారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై తొలిసంతకం చేశారన్నారు. కానీ నేటికీ నోటిఫికేషన్ వెలువడలేదని, నోటిఫికేషన్ రాక లక్షలాది మంది నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లలో లక్షలాది రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకుంటూ తీవ్ర నిరాశకు గురవుతున్నారన్నారు. నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందో తెలియక, అసలు వస్తుందో రాదో అన్న అయోమయ పరిస్థితిలో పలువురు అభ్యర్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. విజయనగరం జిల్లాకు పోస్టుల ఎంపిక విషయంలో అన్యాయం జరిగిందని, తక్కువ పోస్టులు మంజూరు చేశారని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. 16,347 వేల పోస్టులు కాకుండా 25 వేలతో మెగా డీఎస్సీ నిర్వహించేలా చూడాలని, నిరుద్యోగ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. త్వరితగతిన డీఎస్సీ నోటిఫికేషన్ అన్ని వివరాలతో వెలువడేలా చూడాలని, తక్షణమే మెగా డీఎస్సీ ద్వారా పోస్టులను భర్తీ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రెండు వారాల్లో సివిల్ వర్క్స్ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సమగ్ర శిక్షణ రాష్ట్ర బృందం అధికారి డాక్టర్ ప్రసాదరావు

విజయనగరం అర్బన్: జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను రెండు వారాల్లో పూర్తి చేయాలని ఆయా స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు, ఇంజినీర్లను పథకం రాష్ట్ర అధికారుల బృందం ఆదేశించింది. పీఎంశ్రీ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ విభాగ సిబ్బందితో స్థానిక యూత్ హాస్టల్‌లో గురువారం రాష్ట్రబృందం అధికారులు డాక్టర్ ఎం.ప్రసాదరావు, మహేశ్వరరెడ్డి, జయలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పీఎంశ్రీ పథకం మంజూరైన 34 పాఠశాలల అభివృద్ధికి సంబంధించిన సివిల్‌వర్క్స్'లో భాగంగా కెమిస్ట్రీ ల్యాబ్స్, లైబ్రరీ రూమ్స్, ప్లే ఫీల్డ్స్, కిచెన్ గార్డెన్ రియిన్ వాటర్ హార్వెస్టింగ్ తదితర పనుల వివరాలను పాఠశాలల వారీగా తెలుసుకున్నారు. అదేవిధంగా అకడమిక్ పురోభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంబంధిత పనులకు నిధులు మంజూరయ్యాయని జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని కోరారు. ఎస్ఎస్ఏ ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో డీఈఓ యు.మాణిక్యంనాయుడు, ఏఎంఓ బి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణం పరిధిలోని మలిచర్ల ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ పథకం పనులను రాష్ట్ర బృందం పరిశీలించింది.

విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ పరిశీలన

పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' పథకానికి సంబంధించిన సామగ్రి స్టాక్ పాయింట్‌ను సమగ్ర శిక్ష రాష్ట్ర అధికార బృందం సందర్శించింది. త్వరలో జిల్లాలోని 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అందజేసే స్టూడెంట్ కిట్స్‌ను భద్రపరిచే ప్రదేశాలను పరిశీలించారు. జిల్లాకు వచ్చిన కిట్స్ ప్రతి విద్యార్థికి అందేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు సూచించారు.

సమ్మర్ ఆన్‌లైన్ ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి



కె.సాయికృష్ణ చైతన్య

పార్వతీపురంటౌన్: సమ్మర్ ఆన్‌లైన్ షార్ట్ టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయి కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రోగ్రామ్ రెండు విడతలుగా నిర్వహిస్తారని తెలిపారు. మొదటి విడత ఈ నెల 28 నుంచి, రెండవ విడత మే 12 నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

2025–26 విద్యా సంవత్సరానికి చెందిన మూడవ, నాల్గవ సంవత్సరం సీఎస్ఈ/ఐటీ, ఈసీఈ, ఈఈఈ మెకా నికల్, సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రత్యేకంగా ఈ కోర్సు రూపొందించినట్లు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం. ఏపీ.జీఓవీ.ఇన్/యూజర్-రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9988853335, 8712655686, 8790117279, 8790118349 నంబర్లను సంప్రదించాలని సూచించారు.